సాక్షి
పార్వతీపురం మన్యం

సోమవారం । 29 । మే । 2023



స్వచ్ఛతలో జోగింపేట టాప్

జాతీయ స్థాయి ఉత్తమ పంచాయతీ అవార్డు మండ లంలోని జోగింపేట గ్రామాన్ని వరించింది.

- 8లో



విత్తన ఎంపికే కీలకం

వ్యవసాయంలో అత్యంత ప్రధానమైనది విత్తన ఎంపిక. ఈ ప్రక్రియే రైతు దశ, దిశను మారుస్తుంది.

- 8లో

సెల్లార్‌లో 'జగనన్నకు చెబుదాం'

పార్వతీపురం: కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో ప్రతీ సోమవారం ప్రజల నుండి వినతులు స్వీకరించే 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమాన్ని పరిపాలన కారణాల దృష్ట్యా ఈ నెల 29న సోమవారం కలెక్టర్ కార్యాలయం దిగువన గల సెల్లార్ హాల్‌లో నిర్వహించనున్నట్లు డీఆర్‌ఓ జె.వెంకటరావు తెలిపారు. 'జగనన్నకు చెబుదాం'కు వచ్చే జిల్లా అధికారులు, అర్జీదారులు ఈ విషయాన్ని గమనించాలని కోరారు.

న్యూస్‌రీల్

జాతీయ అవార్డుకు జోగింపేట పంచాయతీ

పార్వతీపురం: జాతీయ అవార్డుకు పార్వతీపురం మన్యం జిల్లా జోగింపేట పంచాయతీ ఎంపికైంది. ఈ మేరకు పర్యావరణ, అటవీశాఖ మంత్రిత్వ శాఖ నుండి సమాచారం అందింది. ప్రపంచ పర్యావరణ దినోత్సవంలో భాగంగా జూన్ 5వ తేదీన న్యూఢిల్లీ విజ్ఞాన్ భవన్‌లో జరిగే వేడుకల్లో పంచాయతీలకు అవార్డులను ప్రదానం చేయనున్నారు. పచ్చదనం, పరిశుభ్రత(క్లీన్ అండ్ గ్రీన్) విభాగంలో జోగింపేట ఎంపికైంది. రాష్ట్రంలో మూడు పంచాయతీలు పచ్చదనం, పరిశుభ్రత విభాగంలో ఎంపిక కాగా వాటిలో ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా బిల్లనందూరు, నెల్లూరు జిల్లా కడలూరు ఉన్నాయి. జోగింపేట పంచాయతీ సర్పంచ్ కళ్యంపూడి సింహచలం నేతృత్వంలో శతశాతం బహిరంగ మల విసర్జన లేని పంచాయతీగా, తాగునీటి సరఫరా, పచ్చదనం, మురుగునీరు పారుదల – పారిశుద్ధ్యం, పౌష్టికాహారం విధానాలు పాటించడం, సుపరిపాలన, వీధి దీపాలు, ఏర్పాటు వంటి చర్యలు చేపట్టారు. గ్రామ పరిధిలో 540 మొక్కలు నాటి పచ్చదనం కల్పించడంతో పాటు ఆహ్లాదకర వాతావరణం తీసుకురావడంలో సఫలీకృతులయ్యారు.

అభినందనలు

జోగింపేట పంచాయతీ జాతీయ అవార్డుకు ఎంపిక కావడం పట్ల కలెక్టర్ నిషాంత్‌కుమార్ అభినందనలు తెలిపారు. రానున్న రోజులలో మరిన్ని పంచాయతీలు అవార్డులు సొంతం చేసుకోవాలని ఆయన ఆకాంక్షించారు. అన్ని రంగాలలో ప్రగతి సాధించి ఆయారంగాల్లో అందించే అవార్డులు పొందేందుకు పోటీ పడాలన్నారు. అలాగే జాతీయ అవార్డు పంచాయతీకి ఎంపిక కావడంపై డీపీఓ బి.సత్యనారాయణ హర్షం వ్యక్తం చేశారు.

బదిలీల్లో అసంబద్ధ అంశాలను తొలగించాలి



డిప్యూటీ ఈఓకి వినతి పత్రం అందజేస్తున్న ప్యాప్టో నాయకులు

విజయనగరం పూల్‌బాగ్: బదిలీల్లో అసంబద్ధ అంశాలను తొలగించాలని, ఉపాధ్యాయుల పదోన్నతులు ఆన్‌లైన్‌లో కాకుండా మాన్యువల్‌గా చేపట్టాలని ప్యాప్టో నాయకులు డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్యాప్టో పిలుపు మేరకు సభ్య సంఘాల నాయకులు, ఉపాధ్యాయులు డీఈఓ కార్యాలయం వద్ద ఆదివారం నిరసన తెలిపారు. అనంతరం డిప్యూటీ ఈఓ ఎన్.తిరుపతినాయుడుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ప్యాప్టో చైర్మన్ బి.మహేశ్వరరావు, జనరల్ సెక్రటరీ సిహెచ్.వెంకటరమణ, కో చైర్మన్ పి.శ్రీనివాసరావు, వై.అప్పారావు, బుకారీబాబు తదితరులు పాల్గొన్నారు.

నేడు వైఎస్సార్‌సీపీ బైక్ ర్యాలీ

చీపురుపల్లి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తొలి సంతకానికి నాలుగేళ్లు నిండిన సందర్భంగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో భారీ బైక్ ర్యాలీ సోమవారం నిర్వహించనున్నట్లు ఆ పార్టీ మండల నాయకులు ఇప్పిలి అనంతం, వలిరెడ్డి శ్రీనివాసనాయుడు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అందులో భాగంగానే సోమవారం నియోజకవవర్గ స్థాయిలో రెండు వేల బైక్‌లతో ర్యాలీ నిర్వహించి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి మద్దతు తెలపనున్నట్లు చెప్పారు. సోమవారం ఉదయం గరివిడిలో ర్యాలీ ప్రారంభించి చీపురుపల్లి పట్టణంలోని గాంధీబొమ్మ జంక్షన్ వరకు కొనసాగిస్తామని చెప్పారు. ర్యాలీని జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ ప్రారంభిస్తారని తెలిపారు. ర్యాలీ అనంతరం చీపురుపల్లి గాంధీబొమ్మ జంక్షన్‌లో బహిరంగ సభ జరగనున్నట్టు పేర్కొన్నారు. ర్యాలీలో పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు.

క్లస్టర్ విధానం ఉపసంహరించుకోవాలి



మంత్రి బొత్స సత్యనారాయణకు వినతిపత్రం అందజేస్తున్న విద్యార్థి సంఘాల నాయకులు

విజయనగరం పూల్‌బాగ్: ఉన్నత విద్యలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం వచ్చే ఏడాది నుంచి డిగ్రీలో క్లస్టర్ విధానం అమలు చేయాలని ప్రయత్నిస్తోందని, ఈ ఆలోచనను విరమించుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి పి.రామ్మోహనరావు, డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎస్.రుద్రప్రసాద్ కోరారు. ఈ మేరకు విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణను ఆదివారం ఆయన నివాసంలో కలిసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీహెచ్ వెంకటేష్, సీహెచ్ హరీష్, తదితరులు పాల్గొన్నారు.

మన్యంలో
విద్యా విప్లవం



విద్యతోనే దేశాభివృద్ధి సాధ్యమని.. పేద విద్యార్థుల ఉన్నత చదువులే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చదువుల విప్లవానికి శ్రీకారం చుట్టారు. దాని ఫలితమే ఇటీవల వెలువడిన టెన్త్ ఫలితాల్లో మన్యం జిల్లా రాష్ట్రంలోనే మొదటి స్థానంలో నిలిచి ఔరా అనిపించింది.



నాడు - నేడులో సుందరంగా రూపుదిద్దుకున్న పాఠశాలలు

- విద్యా రంగంలో విప్లవాత్మక మార్పులు
- పేద విద్యార్థుల ఉన్నత విద్యే ప్రభుత్వ ధ్యేయం
- జిల్లాలో 545పాఠశాలలకు రూ.144.60 కోట్లతో నాడు- నేడు పనులు
- అమ్మఒడి పథకం ద్వారా 86,409మంది విద్యార్థులకు రూ.129.61 కోట్లు
- 97,474 మంది విద్యార్థులకు జగనన్న విద్యాకానుక
- మొదటి విడత 2700 ట్యాబుల పంపిణీకి రూ.35.20 కోట్లు
- ఫలితంగా పది ఫలితాల్లో రాష్ట్రంలోనే మన్యం ఫస్ట్



విద్యాకానుక కిట్లతో విద్యార్థులు (ఫైల్)

పార్వతీపురం టౌన్: రాష్ట్రంలోని వైఎస్సార్‌సీపీ సర్కార్ ప్రభుత్వ పాఠశాలల బలోపేతమే లక్ష్యంగా పథకాలను అమలు చేస్తోంది. 'మనబడి నాడు–నేడు'లో భాగంగా కార్పొరేట్ తరహా వసతులతో పాఠశాలలను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుతున్నారు. అమ్మఒడితో పేద విద్యార్థుల తల్లిదండ్రులకు భరోసా ఇస్తున్నారు. విద్యాకానుకతో పిల్లలు చదువుకునేలా విద్యా సామగ్రి అందిస్తున్నారు. విద్యార్థుల సంపూర్ణ ఆరోగ్యమే ధ్యేయంగా జగనన్న గోరుముద్ద ద్వారా నాణ్యమైన, రుచికరమైన ఆహారం అందిస్తున్నారు. వీటన్నింటికీ పార్వతీపురం మన్యం జిల్లాకు 2022 – 23లో భారీగా నిధులు విడుదల చేశారు. ఫలితంగా పది ఫలితాల్లో ఉత్తీర్ణతా శాతంలో రాష్ట్రంలోనే పార్వతీపురం మన్యం జిల్లా ప్రథమ స్థానంలో నిలిచింది.

నాడు – నేడు పనులతో సుందరంగా బడులు

జిల్లాలో మనబడి నాడు – నేడు కార్యక్రమంలో ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మారుతున్నాయి. సర్వాంగ సుందరంగా పాఠశాలలను అభివృద్ధి చేస్తున్నారు. ఇప్పటికే మొదటి విడతలో 486 పాఠశాలలకు రూ.111.44 కోట్లతో మౌలిక వసతులను అభివృద్ధి చేశారు. మొదటి విడత పనులు పూర్తి కాగా ఈ ఏడాదిలో రెండో విడత నాడు – నేడు కింద పార్వతీపురం మన్యం జిల్లాలో 414 పాఠశాలలు, 117 అంగన్‌వాడీ కేంద్రాలు, 14 జూనియర్ కళాశాలలు అభివృద్ధి చేయడానికి రూ.144.60 కోట్లు మంజూరు చేశారు. ప్రస్తుతం పనులు చురుగ్గా సాగుతున్నాయి.

అమ్మఒడితో ఆర్థిక భరోసా

ఆర్థిక ఇబ్బందులతో పేద విద్యార్థులు చదువులకు దూరం కాకూడదనే మంచి ఉద్దేశంతో అర్హులైన ప్రతీ విద్యార్థి తల్లుల బ్యాంకు ఖాతాలో రూ.15 వేల చొప్పున నగదు జమ చేసి ఆర్థిక భరోసా కల్పించారు. జిల్లాలో అర్హత గల 86,409 మంది విద్యార్థుల తల్లుల బ్యాంకు ఖాల్లో రూ. 129.61 కోట్లను అందజేసి పిల్లల చదువులకు నేనున్నానని భరోసా కల్పించారు.

విద్యాకానుకతో ధీమా

విద్యాకానుక పేరిట మూడు జతల యూనిఫాం, నోటు పుస్తకాలు, జత బూట్లు, రెండు జతల సాక్సులు, బెల్టు, బ్యాగ్, పాఠ్యపుస్తకాల కిట్లను జిల్లాలో 97,474 మందికి అందజేశారు. అలాగే 6 నుంచి 10వ తరగతి విద్యార్థులకు ఆక్స్‌ఫర్డ్ డిక్షనరీలు, 1 నుండి 5వ తరగతి విద్యార్థులకు పిక్టోరల్ డిక్షనరీలు(బొమ్మల నిఘంటువులు) అందజేశారు. ఒక్కో విద్యాకానుక కిట్‌కు రూ.1,530 చొప్పున రూ14.91కోట్ల నిధులు వినియోగించారు.

అమ్మచేతి ముద్దలా జగనన్న గోరుముద్ద

విద్యార్థులకు రుచి, ఆరోగ్యకరమైన పోషకాలతో కూడిన ఆహారం అందించేందుకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యమిస్తుంది. జగనన్న గోరుముద్ద పథకం ద్వారా పక్కాగా మెనూ అమలు చేస్తోంది. ప్రైమరీ విద్యార్థులకు ఒక్కొక్కరికీ రూ.4.97, ప్రాథమికోన్నత, హైస్కూల్ విద్యార్థులకు రూ.7.45చొప్పున ఏజెన్సీలకు ప్రభుత్వం చెల్లిస్తోంది. జిల్లాలో 97,474 మంది విద్యార్థులు జగనన్న గోరుముద్ద తీసుకుంటున్నారు.

పోటీ పరీక్షలు ఎదుర్కొనేలా..

సర్కారు బడుల విద్యార్థులు చదువులో ప్రపంచంతో పోటీ పడేలా వారిని తీర్చిదిద్దేందుకు బైజూస్‌తో ఒప్పందం కుదుర్చుకుంది. జిల్లాలో 1225 పాఠశాలల్లో 86,409 మంది విద్యార్థులకు ట్యాబ్‌ల పంపిణీకి పూర్తి చర్యలు చేపట్టింది. మొదటి విడతలో 2700 ట్యాబ్‌లు పంపిణీకి రూ.35.20 కోట్ల నిధులు వెచ్చించి పంపిణీ చేశారు. దశల వారీగా పూర్తి స్థాయిలో విద్యార్థులకు పంపిణీ చేయనున్నారు.

విద్యారంగానికి పెద్దపీట



ప్రభుత్వం విద్యారంగానికి పెద్ద పీట వేస్తుంది. నాడు - నేడు పథకం ప్రవేశపెట్టి పాఠశాలల రూపు రేఖలు మార్చారు. పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించడంతో కార్పొరేట్‌కు ధీటుగా పోటీనిస్తున్నాయి. విద్యార్థుల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని ప్రతి వారం స్కూల్ హెల్త్ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. నూతన మెనూ ప్రకారం జగనన్న గోరుముద్దలో మంచి పౌష్టికాహారాన్ని అందజేస్తున్నాం. ప్రభుత్వం విద్యా వ్యవస్థలో సమూల మార్పులు తీసుకు వచ్చింది.

– ఎస్.ప్రేమ్ కుమార్, జిల్లా విద్యాశాఖాధికారి, పార్వతీపురం మన్యం

ఆశావహ జిల్లాకు
అదనపు నిధులు



గిరిజన గ్రామాలలో మొబైల్ టవరు ఏర్పాటు చేయడంతో సంతోషం వ్యక్తం చేస్తున్న గిరిజనులు

- జిల్లాకు రూ.3 కోట్ల అదనపు కేటాయింపులు

పార్వతీపురం: పార్వతీపురం మన్యం జిల్లా మరో మైలు రాయిని చేరుకుంది. జాతీయ స్థాయి సంస్థ నీతి అయోగ్ వివిధ రంగాల్లో అభివృద్ధి సాధించేందుకు ఆశావహ జిల్లాలను ఎంపిక చేయడం.. అందులో 2022 అక్టోబర్ నెలలో జిల్లాను చేర్చడం జరిగింది. అప్పటి నుండి నీతి అయోగ్ పొందుపరిచిన శీర్షికలు (థీమ్) – వైద్య ఆరోగ్య, విద్యా, వ్యవసాయం, నైపుణ్య అభివృద్ధి, ప్రాథమిక మౌలిక సదుపాయాల కల్పనా రంగంలో అభివృద్ధికి జిల్లా యంత్రాంగం అనేక చర్యలు చేపట్టింది. జిల్లాలో ప్రాథమిక మౌలిక సదుపాయల కల్పనా రంగంలో భాగంగా మొబైల్ టవర్ల కల్పన, మారుమూల ఆవాసాలకు పీఎంజీఎస్‌వై కింద రహదారుల నిర్మాణం, గ్రామాలలో ప్రభుత్వ సేవలు అందుబాటులోకి తేవడం, గృహ నిర్మాణాలు వేగవంతం చేయడం తదితర పనులను చేపట్టడం జరుగుతుంది. అనతి కాలంలోనే నీతి అయోగ్ ప్రశంసలు అందుకొని జాతీయ స్థాయిలో మంచి స్థానాన్ని సాధించి రూ.3కోట్లు అదనపు నిధుల కేటాయింపు పొందింది. ఈ మేరకు నీతి అయోగ్ అదనపు కార్యదర్శి వి.రాధ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి సమాచారాన్ని అందించారు. ఆశావహ జిల్లాల పనితీరును ఆయా రంగాల్లో నీతి అయోగ్ నిర్దేశించిన సూచికల ఆధారంగా ర్యాంకులను నిర్ణయిస్తారు. 2022 డిసెంబర్ నాటికి వున్న ప్రగతిని ఆధారంగా చేసుకుని ర్యాంకులను నిర్ణయించారు. ఇందులో ప్రాథమిక మౌలిక సదుపాయాల రంగంలో మంచి ర్యాంకును సాధించిందని అదనపు కార్యదర్శి తెలిపారు. ప్రగతి, ర్యాంకు ఆధారంగా అదనంగా రూ.3 కోట్లు నిధులు కేటాయింపునకు అర్హత సాధించిందని, అందుకు తగిన ప్రతిపాదనలు కార్యాచరణ ప్రణాళిక రూపొందించి జూన్ 15 నాటికి సమర్పించాలని సూచించారు. ప్రతిపాదనలను ఆశావహ జిల్లాల యంపవర్డ్ కమిటీ పరిశీలిస్తుందని ఆమె పేర్కొన్నారు. జిల్లా బృందానికి అదనపు కార్యదర్శి శుభాకాంక్షలు తెలియజేయడంతో పాటు, చక్కటి సేవలు అందిస్తున్నందుకు కలెక్టర్ సర్వీసు రిజిస్టర్‌లో నమోదు చేయాలని సూచించారు.

నీతి అయోగ్ ప్రశంస

మొబైల్ టవర్ల ఏర్పాటుపై ఇటీవల ట్విట్టర్‌లో నీతి అయోగ్ ట్వీట్ చేస్తూ ప్రశంసించిన విషయం విదితమే. సుదూర ప్రాంతాల ప్రజల మొబైల్ కనెక్టివిటీకి జిల్లా యంత్రాంగం చేస్తున్న కృషిని మెచ్చుకోవడం జరిగింది.

అందరి సమిష్టి కృషితోనే..

ఆశావహ జిల్లాగా పార్వతీపురం మన్యం జిల్లాను చేర్చడం, నిర్దేశించిన అంశాల్లో ప్రగతి సాధించడం అందులో మంచి ర్యాంకును సాధించడంపై కలెక్టర్ నిషాంత్‌కుమార్ సంతోషం వ్యక్తం చేశారు. ఇందులో భాగస్వామ్యమైన ప్రతీ ఒక్కరికీ అభినందనలు తెలిపారు. ప్రతీ ఒక్కరు కష్టపడి పని చేస్తున్నారని తద్వారా పార్వతీపురం మన్యం జిల్లాను వేలెత్తి చూపే పరిస్థితి లేకుండా చేస్తున్నారన్నారు. శ్రమకు ఓర్చి కష్టపడి పనిచేస్తూ జిల్లా చరిత్ర మార్చుతున్నారని ప్రశంసించారు. జాతీయ స్థాయి గుర్తింపులో ఎండ, వానలలో సైతం శ్రమిస్తూ గృహ నిర్మాణాలు చేస్తున్న ప్రతి కూలి, ప్రతి మేస్త్రీ, లబ్ధిదారుల భాగస్వామ్యం వుందని ఆయన పేర్కొన్నారు. మొబైల్ టవర్ల ఏర్పాటుకు స్థలాల పరిశీలనలో భాగస్వామ్యమైన వీఆర్‌ఓ నుండి ఉన్నతాధికారుల వరకు, ఇంజినీరింగ్ సహాయకుల నుండి ఏఈ తదితరుల పాత్ర మరువలేనిదన్నారు. ఈ గౌరవం దక్కడంలో మంత్రులు, శాసనసభ్యులు, జెడ్పీటీసీలు, ఎంపీటీసీల సహకారానికి అభినందనలు తెలిపారు. విద్యా శాఖ, పోలీస్ శాఖ తదితర శాఖల తోడ్పాటు ఎంతగానో ఉపకరించిందని అన్నారు.

నాలుగేళ్లలో అభివృద్ధి...
నాలుగు పాదాలు

- కనీవిని ఎరగని రీతిలో సంక్షేమ పథకాల అమలు
- ఉమ్మడి విజయనగరం జిల్లా దశదిశా మారుతోంది
- సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ప్రజలకు ఎంతో మేలు
- సాక్షి ఇంటర్వ్యూలో జడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు



'విద్య, వైద్యం, వ్యవసాయం, ఉపాధి కల్పన రంగాల్లో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం గత నాలుగేళ్ల కాలంలో ఉమ్మడి విజయనగరం జిల్లా ప్రజలకు ఎంతో మేలు చేసింది. అందుకే జిల్లా అభివృద్ధి పథంలో దూసుకు పోతోంది. ప్రజల తలసరి ఆదాయం ఎంతో మెరుగైంది.

సాక్షి ప్రతినిధి, విజయనగరం:

'నాలుగే... నాలుగేళ్లు! ఈ కొద్ది కాలంలోనే ఇరవయ్యేళ్ల కాలంలో జరగాల్సిన అభివృద్ధి సాకారమైంది. ఫార్టీ ఇయర్స్ ఇన్ పాలిటిక్స్, ఫోర్టీన్ ఇయర్స్ చీఫ్ మినిస్టర్ అని చెప్పుకున్నవారు సైతం చేయలేనిది జస్ట్ ఫోర్ ఇయర్స్‌లోనే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం సాకారం చేసి చూపించింది. ఉమ్మడి విజయనగరం జిల్లాకు వరాల మూటను ఇచ్చింది. నవరత్నాలే గాక గతంలో ఎప్పుడూ కనీవినీ ఎరగనన్ని సంక్షేమ పథకాలను పక్కాగా అధికారం చేపట్టినప్పటి నుంచీ అమలు చేసి చూపించింది. గ్రామ సచివాలయాలు, వైఎస్సార్ రైతుభరోసా కేంద్రాలు, వైఎస్సార్ వెల్‌నెస్ సెంటర్లు... ఇలా ప్రతి గ్రామానికీ కనీసం కోటి రూపాయల ప్రజా ఆస్తిని సమకూర్చింది. గత టీడీపీ ప్రభుత్వం కాగితాల్లోనే చూపించిన విజయనగరం ప్రభుత్వ వైద్య కళాశాల, గురజాడ యూనివర్సిటీ, భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం, కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయానికి విశాలమైన సొంత ప్రాంగణం... ఇలా ఎన్నో మైలురాళ్లను సాకారం చేసింది. ప్రజాప్రతినిధులను ప్రజల వద్దకే జగన్‌మోహన్‌రెడ్డి పంపిస్తున్నారంటే మా ధైర్యం అదే'నని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, ఉమ్మడి విజయనగరం జిల్లా పరిషత్తు చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు చెప్పారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నాలుగేళ్ల పాలనా కాలం పూర్తి చేసుకుంటున్న సందర్భంగా ఆయన సాక్షికి ప్రత్యేక ఇంటర్వ్యూ ఇచ్చారు. ఆ వివరాలు ఆయన మాటల్లోనే...

రైతులకు పెద్ద భరోసా

ఉమ్మడి విజయనగరం జిల్లాలో వ్యవసాయమే ప్రధాన ఆధారం. రైతులే అధిక సంఖ్యలో ఉన్నారు. గతంలో ఏ ప్రభుత్వం చేయని విధంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలోని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రైతులకు పెద్ద భరోసా ఇస్తోంది. గత నాలుగేళ్లలో పెద్ద ఎత్తున సంక్షేమ కార్యక్రమాలను క్రమం తప్పక చేస్తూ వస్తోంది. ప్రతి గ్రామానికి అందుబాటులో ఏర్పాటు చేసిన వైఎస్సార్ రైతుభరోసా కేంద్రాలు ఒక విప్లవమనే చెప్పాలి. వ్యవసాయ అధికారులు గ్రామంలోనే అందుబాటులో ఉంటున్నారు. సకాలంలో ఎరువులు, విత్తనాలు అందుతున్నాయి. గత చంద్రబాబు పాలనలో ఉమ్మడి విజయనగరం జిల్లాలో కరువు తాండవం చేసేది. ఇప్పుడు నాలుగేళ్లుగా ఆ పరిస్థితి లేదు. పంటలు సమృద్ధిగా పండుతున్నాయి. పండిన ధాన్యం కూడా మద్దతు ధరకే ప్రభుత్వం కొనుగోలు చేస్తోంది. బహుశా రైతు లను ఇలా అన్నివిధాలా ఆదుకున్న ప్రభుత్వాన్ని విజ యనగరం రైతులు గతంలో ఎప్పుడూ చూసి ఉండ లేదు. రైతుల పట్ల, వారి సంక్షేమం పట్ల ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిబద్ధత, ఆలోచన, కార్యాచరణకు ఇది అద్దం పడుతోంది.

'భోగాపురం' ఉత్తరాంధ్ర తలమానికం

గతంలో ఐదేళ్లు పాలించినా భూసేకరణను పూర్తి చేయలేక కేవలం 2019 సాధారణ ఎన్నికలకు రెండు నెలల ముందు చంద్రబాబు మొక్కుబడి శంకుస్థాపనకు పరిమితమైన భోగాపురం గ్రీన్‌ఫీల్డ్ అంతర్జాతీయ విమానాశ్రయాన్ని ఇప్పుడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సాకారం చేస్తున్నారు. ప్రతిపక్ష పార్టీలు ఎన్ని అడ్డంకులు కల్పించినా, కోర్టుల్లో ఎన్ని పిటిషన్లు వేయించినా అన్నింటినీ అధిగమిస్తూ, సమస్యలన్నీ పూర్తిగా పరిష్కరిస్తూ వచ్చారు. కేంద్రం నుంచి అన్ని అనుమతులు తీసుకొచ్చారు. ఇటీవలే అట్టహాసంగా శంకుస్థాపన చేశారు. 36 నెలల్లో పూర్తి చేయడమే లక్ష్యంగా పనులను సీఎం ప్రారంభించారు.

ఇది సాకారమైతే విజయనగరం సహా ఉత్తరాంధ్రకు తలమానికం అవుతుంది. జిల్లాల పునర్విభజనతో ఏర్పడిన కొత్త విజయనగరం జిల్లా అన్నివిధాలా అన్ని రంగాల్లో అభివృద్ధికి ఇది దోహదం చేయనుంది. పరిసర ప్రాంతాల్లో విమానాశ్రయ అనుబంధ, ఆధారిత పరిశ్రమలు అనేక సంఖ్యలో వస్తాయి. హోటళ్లు, పర్యాటక రంగం అభివృద్ధి చెందుతుంది. తద్వారా స్థానికంగా ఉపాధి అవకాశాలు ఎన్నో రెట్లు మెరుగుపడతాయి.

ఆత్మ సంతృప్తితో పనిచేస్తున్నా...

పార్టీ కార్యకర్తలకు అన్నివేళలా అందుబాటులో ఉంటున్నా. క్యాడర్‌కు ఏ సమస్య వచ్చినా పరిష్కరించేందుకు చొరవ తీసుకుంటున్నా. అధిష్టానం జడ్పీ చైర్మన్‌గా నాకు ఇచ్చిన అవకాశాన్ని ప్రజలకు మేలు చేయడానికి సద్వినియోగం చేస్తున్నా. ఆత్మ సంతృప్తితో పని చేస్తున్నా. మరే బాధ్యతలు అప్పగించినా తుచ తప్పకుండా నెరవేర్చడానికి ప్రయత్నిస్తాను. 2019 సార్వత్రిక ఎన్నికల్లో మాదిరిగానే 2024 ఎన్నికల్లోనూ పార్టీ విజయానికి కృషి చేస్తాం. వచ్చే ఎన్నికల్లో కూడా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డినే ముఖ్యమంత్రిని చేసుకుంటాం.'

పోయే ప్రాణాలకు ఊపిరి

ఉమ్మడి విజయనగరం జిల్లాలో ఎవ్వరికైనా ప్రాణం మీదకు వస్తే విశాఖపట్నంలోని ఆస్పత్రులకు పరుగు పెట్టాల్సిందే. సకాలంలో వైద్యం అందక ఎన్నో ప్రాణాలు మధ్య దారిలోనే పోయేవి. ఇలాంటి పరిస్థితులను మార్పు చేయాలనే సంకల్పంతో జిల్లాకు ఒకటి చొప్పున ప్రభుత్వ వైద్య కళాశాలను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీసుకొచ్చారు. రూ.500 కోట్లతో విజయనగరం వైద్య కళాశాల నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. వచ్చే విద్యా సంవత్సరం నుంచే 150 ఎంబీబీఎస్ సీట్లతో వైద్య కళాశాల తరగతు లు ప్రారంభించేందుకు వీలుగా ప్రభుత్వం ఏర్పాట్లు చేసింది. అందుకు అనుగుణంగా జిల్లా సర్వజన ఆస్పత్రిని ఆధునిక హంగులతో తీర్చిదిద్దారు. కొత్తగా ఏర్పడిన పార్వతీపురం మన్యం జిల్లాకు కూడా మరో ప్రభుత్వ వైద్య కళాశాలను ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి మంజూరు చేశారు. 'ఫ్యామిలీ ఫిజీషియన్' పేరుతో వైద్యులను గ్రామాలకే పంపి వైద్యం చేయించడం వల్ల ఎక్కువ లబ్ధి కలుగుతున్న ది ఉమ్మడి విజయనగరం జిల్లా ప్రజలకేనని ఘంటాపథంగా చెబుతున్నాను.

విద్యలో ముందడుగు

విద్యారంగంలో ఒకప్పుడు ఉమ్మడి విజయనగరం జిల్లా ఎంతో వెనుకబడి ఉండేది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంస్కరణలతో ప్రభుత్వ పాఠశాలలు బాగుపడ్డాయి. పదో తరగతి ఫలితాల్లో పార్వతీపురం మన్యం జిల్లా రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో నిలిచిందంటే ఆ ఘనత మా ప్రభుత్వానికే దక్కుతుంది. పేదింటి పిల్లలు ప్రభుత్వం ఇస్తున్న ఇతోధిక సాయంతో ప్రభుత్వ బడుల్లో చదువుకుంటున్నారు. అత్యుత్తమ ప్రతిభతో పరీక్షల్లో తమ సత్తా చాటుతున్నారు. విద్యారంగానికి ముఖ్యమంత్రి అత్యధిక ప్రాధాన్యత ఇవ్వడం వల్ల సాధ్యమవుతున్న ఫలితాలివి.

మౌలిక వసతుల్లో ఎంతో మెరుగు

రూ.వంద కోట్లకు పైబడి ఖర్చుతో ఇంటింటా కుళా యి పథకం ద్వారా ప్రజలందరి తాగునీటి సమస్య ను పరిష్కరిస్తున్నాం. నవరత్నాలు – పేదలందరికీ ఇల్లు పథకం ద్వారా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ జిల్లాలో సుమారు లక్ష కుటుంబాలకు సొంతింటి కలను సాకారం చేశారు. గతంలో టీడీపీ ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే రోడ్లకు దుస్థితి వచ్చింది. వాటన్నింటినీ ప్రాధాన్యత క్రమంలో నిర్మాణం పూర్తి చేస్తున్నాం. జిల్లాలో నదులపై వంతెనల నిర్మాణ పనులు కొలిక్కి వస్తున్నాయి.

ఉద్యోగులు, అధికారుల సహకారంతో...

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేసిన మేలు ఏమిటో ప్రజలకు చెప్పాలని, ఇంకా ఎవరైనా అర్హులకు సాంకేతిక కారణాల వల్ల పథకాలు అందకపోతే వెంటనే చక్కదిద్దాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పదేపదే చెబుతున్నారు. మ్యానిఫెస్టోను 99 శాతం అమలు చేశారు కాబట్టే మా ప్రజాప్రతినిధులను ప్రజల వద్దకు ధైర్యంగా పంపిస్తున్నారు. ఇంకా సమస్యలుంటే 'జగనన్నకే చెబుదాం' అని నేరుగా తనకే చెప్పుకునే అవకాశం ఇచ్చిన ముఖ్యమంత్రి కూడా ఆయనే! ఇలాంటి సాహసం చేయడం మన రాష్ట్ర చరిత్రలోనే కాదు దేశంలోనే ఇదే తొలిసారి అని చెప్పవచ్చు. ఏ పథకమైనా, ఏ సంక్షేమ కార్యక్రమమైనా పూర్తి సంతృప్తకర స్థాయిలో చేయగలుగుతున్నారు. ఇదంతా ఉద్యోగులు, అధికారుల సహకారంతోనే సాధ్యమైంది. వారంతా మా ప్రభుత్వంపై అసంతృప్తితో ఉన్నారంటూ ప్రతిపక్షాలు చేస్తున్న ప్రచారంలో వాస్తవం లేదు.

క్లుప్తంగా

31న జాబ్‌మేళా



మాట్లాడుతున్న జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి సాయికుమార్

పార్వతీపురంటౌన్: పట్టణంలోని శ్రీవేంకటేశ్వర ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈ నెల 31వ తేదీన మినీ జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి యు.సాయికుమార్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. డాక్టర్ రెడ్డీస్ ల్యాబరేటరీస్‌లో ఉద్యోగాలకు నిర్వహించే ఈ జాబ్‌మేళాకు ఇంటర్మీడియట్ ఎంపీసీ, బైపీసీ చదివి, 18 నుంచి 20 ఏళ్ల మధ్య వయసున్న నిరుద్యోగ యువతీ, యువకులంతా అర్హులన్నారు. ఆసక్తి ఉన్న వారు తొలుత డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.ఏపీఎస్ఎస్‌డీసీ.ఇన్.హెచ్‌టీటీపీ వెబ్‌సైట్‌లో పేర్లు నమోదు చేసుకోవాలని, రిఫరెన్స్ నంబర్‌తో పాటు బయోడేటా ఫారం, ఆధార్‌కార్డు, విద్యార్హత తెలిపే సర్టిఫికెట్లు(ఒరిజినల్), 1 పాస్‌పోర్ట్‌సైజ్ ఫొటో వెంట తీసుకురావాలన్నారు. ఉదయం 9 గంటలకు జాబ్‌మేళా నిర్వహిస్తామని, మరిన్ని వివరాలకు ఫోన్ నంబర్లు 9182398325, 7997299739ను సంప్రదించాలని కోరారు.

డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్‌కు సత్కారం



సుదర్శన్ రెడ్డిని సన్మానిస్తున్న విజయనగరం జిల్లా ప్రాసిక్యూటర్లు

విజయనగరం లీగల్: డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్‌గా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన కడప జిల్లాకు చెందిన సీనియర్ న్యాయవాది జల్ల సుదర్శన్ రెడ్డిని విజయనగరం జిల్లాకు చెందిన ప్రాసిక్యూటర్లంతా సత్కరించారు. ఆదివారం విశాఖపట్నంలో జరిగిన జోన్–1 సమీక్ష సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయనను వీరంతా కలిసి, దుశ్శాలువా, మెమెంటోలతో సన్మానించి, అభినందనలు తెలిపారు. అనంతరం పలు సలహాలు, సూచనలు చేశారు. కార్యక్రమంలో డిప్యూటీ డైరెక్టర్ మెట్ట ఖజానారావు, పబ్లిక్ ప్రాసిక్యూటర్ వేలూరి రఘురాం, స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్లు బెల్లాన రవి, మరువాడ రవీంద్రనాథ్, ఖండపు, ఫల్గుణరావు, మావూరి శంకరరావు పాల్గొన్నారు.

ఐరన్ దొంగలు దొరికారు..



పట్టుబడిన దొంగలతో ఎస్‌ఐ సన్యాసినాయుడు, సిబ్బంది

చీపురుపల్లి: గ్రామీణ తాగునీటి సరఫరా విభాగానికి చెందిన ఐరన్ పైపులను దొంగిలించిన నలుగురు దొంగలను 24 గంటలు గడవక ముందే ఎస్‌ఐ సన్యాసినాయుడు ఆధ్వర్యంలో పోలీసులు పట్టుకుని, అరెస్ట్ చేశారు. వివరాలిలా ఉన్నాయి.. చీపురుపల్లి మేజర్ పంచాయతీ పరిధిలోని గ్రామీణ తాగునీటి సరఫరా విభాగానికి చెందిన 300 కేజీల బరువైన 12 పైపులను ఈ నెల 26వ తేదీన రాత్రి దొంగిలించారు. దీనిపై ఈ నెల 27వ తేదీన ఉదయం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు అందింది. అప్రమత్తమైన ఎస్‌ఐ సన్యాసినాయుడు సిబ్బందితో కలిసి దర్యాప్తు ముమ్మరం చేశారు. చోరీకి పాల్పడిన పట్టణానికి చెందిన బంగారు కనకరాజు, పేరూరి కనకరాజు, లకవలస త్రిమూర్తులు, గంగు మురళిను అదేరోజు సాయంత్రం పట్టణంలోని ఫైర్ స్టేషన్ సమీపంలో పట్టుకున్నారు. అనంతరం వారి నుంచి పైపులను స్వాధీనం చేసుకున్నారు. పైపుల రవాణాకు వినియోగించిన ఆటోను కూడా సీజ్ చేసి, వారిని అరెస్ట్ చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

జూదరుల అరెస్ట్

విజయనగరం క్రైమ్: స్థానిక ధర్మపురి సమీపంలో పేకాట ఆడుతున్న ముగ్గురు వ్యక్తులు(జూదరులు)ను పోలీసులు ఆదివారం పట్టుకుని, అరెస్ట్ చేశారు. అనంతరం వారి నుంచి రూ.7,400 నగదు స్వాధీనం చేసుకున్నట్లు రూరల్ సీఐ టి.వి.తిరుపతిరావు తెలిపారు. ఇదిలా ఉండగా, చెల్లూరు గ్రామ సమీపంలో పేకాట ఆడుతున్న మరో నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని, వారి నుంచి రూ.3,200 నగదు స్వాధీనం చేసుకున్నామని సీఐ పేర్కొన్నారు.

కోడిగుడ్ల ధరలు

హోల్‌సేల్ ధరలు	(100 గుడ్లు)
విశాఖపట్నం	రూ. 480.00
విజయనగరం	రూ. 485.00
శ్రీకాకుళం	రూ. 485.00

బులియన్

విశాఖపట్నం	
బంగారం(24సి. 10గ్రా.)	56,000–00
బంగారం(22సి. 10గ్రా.)	61,100–00
వెండి (కిలో)	78,000–00

చికెన్

బ్రాయిలర్


లైవ్	డ్రెస్‌డ్	స్కిన్‌లెస్
₹154	₹278	₹ 288

స్వచ్ఛతలో జోగింపేట టాప్

- గ్రామానికి జాతీయ స్థాయిలో ఉత్తమ పంచాయతీ అవార్డు
- పచ్చదనం, పరిశుభ్రతలో సేవలకు గాను అరుదైన గౌరవం
- గ్రామాభివృద్ధిలో యువత పాత్ర కీలకం
- మౌలిక సదుపాయాలతో గ్రామస్తుల హర్షం



నిర్మాణ దశలో జోగింపేట గ్రామ ముఖద్వారం



జోగింపేట గ్రామం

సీతానగరం: జాతీయ స్థాయిలో ఉత్తమ పంచాయతీ అవార్డు మండలంలోని జోగింపేట గ్రామాన్ని వరించింది. ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న స్వచ్ఛ సంకల్పంలో భాగంగా పచ్చదనం, పరిశుభ్రత, తాగునీటి సరఫరాలో అందించిన విశేష సేవలకు గాను ఈ అవార్డు లభించింది. సరిగ్గా మూడేళ్ల క్రితం గ్రామంలోని యువకులంతా కలిసి సుబ్బమ్మ పేరంటాలు సేవా సంఘంగా ఏర్పాటయ్యారు. సంఘ సభ్యులంతా శ్రమదానం, గ్రామపెద్దల సహకారంతో విశాఖ–రాయగడ రోడ్డులోని గ్రామ జంక్షన్ నుంచి గ్రామం లోపలికి దాదాపు కిలోమీటరు పొడవునా రోడ్డుకు ఇరువైపులా ఆలయాలు, చెరువుల చుట్టూ మొక్కలు నాటి, సంరక్షణ చర్యలు చేపట్టారు. అలాగే సుబ్బమ్మ పేరంటాలు ఆలయ అభివృద్ధి చేపట్టి, ఆదర్శంగా నిలిచారు.

సంఘ సభ్యుడే సర్పంచ్..

2021లో జరిగిన పంచాయతీ ఎన్నికల్లో సుబ్బమ్మ పేరంటాలు సంఘంలోని సభ్యుడైన కల్యంపూడి సింహాచలం సర్పంచ్‌గా ఎన్నికయ్యారు. తనపై గ్రామస్తులు ఉంచిన నమ్మకం వమ్ము చేయకుండా ఆయన సేవా కార్యక్రమాలపై దృష్టిసారించారు. ప్రభుత్వం పంచాయతీకి కేటాయించిన నిధులతో పాటు ప్రజలు అందించిన సహాయ, సహకారాలతో అన్నివిధాలుగా గ్రామాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారు. సర్పంచ్‌గా ఎన్నికైన రెండు సంవత్సరాల మూడు నెలల్లోనే గ్రామంలోని సుబ్బమ్మ పేరంటాలు ఆలయంలో భక్తులకు మౌలిక సదుపాయాలు కల్పించారు. దీంతో పాటు గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణం తలపించేలా రేణుకా ఎల్లమ్మ ఆలయం, భోగితల్లి గుడి, ఆంజనేయస్వామి మందిరం నిర్మించారు.



బీటీ రోడ్డులో సర్పంచ్ పర్యవేక్షణలో పారిశుద్ధ్య పనులు

ప్రజారోగ్యానికి ప్రాధాన్యం..

గ్రామంలోని ప్రజల ఆరోగ్యానికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నారు. ప్రతీ 15 రోజులకోసారి పారిశుద్ధ్య పనులు నిర్వహించడం, రోడ్డుకు ఇరువైపులా ఉన్న మొక్కల వద్ద ఉన్న జంగిల్స్, పిచ్చిమొక్కలను తొలగించడం వంటివి చేస్తున్నారు. గ్రామం నుంచి రైతులు పొలాలకు వెళ్లే గోర్జిలను గ్రావెల్ రోడ్లుగా మార్చారు. గ్రామం నుంచి ఇప్పలవలసకు వెళ్లే దారిలో బీటీ రోడ్డుకు ఇరువైపులా మొక్కలు నాటి, పర్యావరణ పరిరక్షణకు కృషి చేశారు. గ్రామానికి తూర్పున ఉన్న రోడ్డును గతంలో బహిర్భూమికి వినియోగించడంతో అటువైపుగా రాకపోకలు సాగించేందుకు ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడేవారు. ఇది గమనించిన సర్పంచ్ ఆ ప్రాంతంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయించి, బహిరంగ మల, మూత్ర విసర్జన నివారణకు కృషి చేశారు. గ్రామ స్వచ్ఛతకు బలమైన పునాది వేశారు.

ప్రభుత్వ సహకారం మరువలేనిది..



గ్రామాభివృద్ధిలో ప్రభుత్వ సహకారం మరువలేనిది. నా వయసు 80 ఏళ్లు. ఇంతవరకు గ్రామంలో ఇంతటి అభివృద్ధి చూడలేదు. అభివృద్ధికి ప్రభుత్వ సహకారంతో పాటు గ్రామ సర్పంచ్, యువత, ప్రజల సహాయ సహకారాలు తోడ్పడ్డాయి.

–కేతిరెడ్డి గుంపస్వామి, సీనియర్ సిటిజన్, జోగింపేట.

మౌలిక సదుపాయాలు ఫుల్..



గ్రామంలో మౌలిక సదుపాయాలు ఫుల్‌గా ఉన్నాయి. రోడ్లు, ఇళ్లు, ఇంటింటికీ తాగునీటి వసతులు కల్పించారు. అర్హులైన వారికి సంక్షేమ పథకాలు అందడంతో ప్రజల జీవన ప్రమాణాలు కూడా బాగున్నాయి.

–కర్రి రాము, గ్రామపెద్ద, జోగింపేట.

గ్రామస్తుల బాగోగులే లక్ష్యం..



నన్ను సర్పంచ్‌గా గెలిపించిన గ్రామస్తుల బాగోగులే లక్ష్యం. గ్రామ అభివృద్ధి నా సాయశక్తులా ప్రయత్నిస్తున్నాను. సొంత నిధులతో రహదారి ఆనుకుని, గ్రామ ముఖద్వారం నిర్మించాను. నా హయాంలో ఉత్తమ గ్రామ పంచాయతీగా ఎంపిక కావడం చాలా ఆనందంగా ఉంది.

కె.సింహాచలం, సర్పంచ్, జోగింపేట.

విత్తన ఎంపికే కీలకం

- ఖరీఫ్‌కు సన్నద్ధమవుతున్న రైతులు
- విత్తన ఎంపికలో జాగ్రత్తలు తప్పనిసరి: అధికారులు
- అన్నదాతలు అప్రమత్తంగా వ్యవహరిస్తే అధిక దిగుబడులు
- బయట దొరికే నకిలీ విత్తనాలతో మోస పోవద్దని సూచన
- ఆర్‌బీకేల్లో నాణ్యమైన విత్తనాలు, ఎరువులు



సాగులో ఉన్న వరి పంట(ఫైల్)

సీతంపేట: వ్యవసాయంలో అత్యంత ప్రధానమైనది విత్తన ఎంపిక. ఈ ప్రక్రియే రైతు దశ, దిశను మారుస్తుంది. విత్తనాల ఎంపిక, కొనుగోలులో ఏమాత్రం అజాగ్రత్తగా ఉన్నా రైతాంగం నష్టపోవాల్సి వస్తుంది. ఈ నేపథ్యంలో అన్నదాతలు సాగుకు సన్నద్ధమవుతున్నప్పుడు విత్తనాల ఎంపికలో తగిన జాగ్రత్తలు పాటించాలని వ్యవసాయ శాస్త్రవేత్తలు సూచిస్తున్నారు. ఖరీఫ్ సీజన్‌లో జిల్లా వ్యాప్తంగా 80 వేల హెక్టార్లలో వరి పంటను సాగు చేస్తారు. అయితే విత్తనాలు ఎంపిక చేసుకునేటప్పుడు రైతులు అప్రమత్తంగా వ్యవహరిస్తే అధిక దిగుబడులు సాధించడం సాధ్యమవుతుంది. నాణ్యమైన విత్తనాలు కొనుగోలు చేసి, సాగు చేస్తే పంట ఆశాజనకంగా ఉంటుందని వ్యవసాయాధికారులు, నిపుణులు చెబుతున్నారు.

విత్తనాల ఉత్పత్తి ఇలా..

విత్తనాలు బ్రీడర్ ఫౌండేషన్ సర్టిఫైడ్ ట్రూత్‌ఫుల్ లేబుల్స్‌లో లభిస్తాయి. వీటిని సాగు చేసి, మళ్లీ విత్తనాలుగా వినియోగించవచ్చు. దీనివల్ల రైతులకు విత్తన భారం తగ్గుతుంది. బ్రీడర్ విత్తనాన్ని వ్యవసాయ పరిశోధన స్థానాలు, యూనివర్సిటీలు, విత్తన కంపెనీల శాస్త్రవేత్తల పర్యవేక్షణలో ఉత్పత్తి చేస్తారు. బ్రీడర్ సీడ్(విత్తనం)కు బంగారం రంగు ట్యాగ్ వేస్తారు. ఈ విత్తనాల ధర కాస్త ఎక్కువగానే ఉండడమే కాకుండా షాపుల్లో విరివిగా లభ్యం కావు. బ్రీడర్ సీడ్ నుంచి ఫౌండేషన్ సీడ్‌ను ఉత్పత్తి చేస్తారు. వివిధ ఉత్పత్తి సంస్థలు సాంకేతిక నిపుణుల ఆధ్వర్యంలో వీటిని పండిస్తారు. ఫౌండేషన్ విత్తనానికి తెలుపు రంగు ట్యాగ్ వేస్తారు. ఫౌండేషన్ సీడ్ నుంచి వచ్చే విత్తనాన్ని సర్టిఫైడ్ సీడ్‌గా వ్యవహరించి, దీనికి నీలం రంగు ట్యాగ్ వేస్తారు. సర్టిఫైడ్ సీడ్ నుంచి వచ్చే విత్తనాలను ట్రూత్ లేబుల్ విత్తనాలుగా వ్యవహరించి, దీనికి ఆకుపచ్చ రంగు ట్యాగ్ వేస్తారు.

కొనుగోలు చేసేటప్పుడు ఇవి చూడాలి..

వ్యవవయ శాఖ నుంచి అనుమతి పొందిన అధీకృత డీలర్ల నుంచి మాత్రమే విత్తనాలు కొనుగోలు చేయాలి. కొనుగోలు సమయంలో తీసుకున్న బిల్లులను పంట కాలం పూర్తయ్యే వరకు జాగ్రత్తగా భద్రపరుచుకోవాలి. బిల్లుపై విక్రయదారుని పేరు, రాష్ట్ర అమ్మకపు పన్ను నంబర్, నికర తూకం, నికర ధర, లాట్ నంబర్, విత్తన రకం, గడువు తేదీ, కంపెనీ పేరు, డీలర్ సంతకం ఉండేలా చూడాలి. ఎట్టిపరిస్థితుల్లోనూ లూజు(విడి) విత్తనాలను కొనుగోలు చేయకూడదు. గడువు దాటిన విత్తనాల జోలికి అస్సలు వెళ్లకూడదు. కొనుగోలు చేసే విత్తనాల ప్యాకెట్ల సంచి, డబ్బాలపై సీల్ ఉందా.. లేదా.. అని చెక్ చేసుకోవాలి. విక్రయదారులు ఇచ్చే కరపత్రాలు తీసుకుని, వాటిలో పేర్కొన్న అంశాలను పూర్తిగా చదివి, అవగాహన చేసుకోవాలి. మొలకెత్తే సమయం, పూత దశలో పంటలో లోపం కనిపిస్తే వెంటనే వ్యవసాయాధికారిని సంప్రదించి, సలహాలు, సూచనలు తీసుకోవాలి. విత్తనం కొనుగోలు చేసిన వెంటనే వాటిని పరీక్షించి, మొలక శాతం పరిశీలించాలి.

మొలక శాతం చూసుకోవాలి..



బయట షాపుల్లో విత్తనాలు కొనుగోలు చేయాల్సి వస్తే లైసెన్స్ ఉన్న డీలర్ల వద్దే విత్తనాలు కొనుగోలు చేయాలి. కొనుగోలు చేసిన విత్తనాల మొలక శాతం పరీక్షించి, తెలుసుకోవాలి. మొలక శాతం తక్కువగా ఉన్న విత్తనాలను కొనుగోలు చేయవద్దు.

–హరికృష్ణ, ప్రాజెక్టు అగ్రికల్చర్ ఆఫీసర్, ఐటీడీఏ, సీతంపేట.

ఆర్‌బీకేల్లో నాణ్యమైన విత్తనాలు..



గ్రామ సచివాలయాల పరిధిలోని ఆర్‌బీకే(రైతు భరోసా కేంద్రాలు)ల్లో లభించే నాణ్యమైన విత్తనాలు, ఎరువులను రైతులు కొనుగోలు చేసుకోవాలి. రైతులు అప్రమత్తంగా ఉండాలి. బయట షాపుల్లో దొరికే నకిలీ విత్తనాలను కొనుగోలు చేసి, మోసపోవద్దు.

–తిలక్, మండల వ్యవసాయాధికారి, సీతంపేట.

రేపు జిల్లా జూడో జట్టు ఎంపిక

బొబ్బిలి: రామభద్రపురం మండలంలోని కొట్టక్కి జెడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో జిల్లా స్థాయి క్యాడెట్ జూడో జట్టు ఎంపిక మంగళవారం నిర్వహిస్తున్నట్లు జూడో అసోసియేషన్ కార్యదర్శి బొత్స రత్నకిశోర్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 గంటలకు జరిగే ఎంపికకు ఆసక్తి ఉన్న క్రీడాకారులంతా హాజరుకావాలని, వచ్చేటప్పుడు ఆధార్‌కార్డు, వయసు ధ్రువీకరణపత్రం తప్పనిసరిగా వెంట తీసుకురావాలన్నారు. 2006, 2007, 2008 సంవత్సరాల్లో పుట్టినవారు ఈ పోటీలకు అర్హులన్నారు. మరిన్ని వివరాలకు ఫోన్ నంబర్ 9440127587ను సంప్రదించాలని కోరారు. చిత్తూరు జిల్లాలోని తిరుపతిలో జూన్ 4వ తేదీ నుంచి మూడు రోజుల పాటు జరిగే రాష్ట్ర స్థాయి జూడో పోటీల్లో ఎంపికైన జట్టు పాల్గొంటుందన్నారు.

సాఫ్ట్‌బాల్ పోటీల్లో జిల్లా జట్ల సత్తా



ట్రోఫీతో విజేత బాలుర జట్టు

విజయనగరం: రాష్ట్ర స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీల్లో జిల్లా జట్లు సత్తా చాటాయి. ఈ నెల 26 నుంచి 28వ తేదీ వరకు కడప జిల్లాలో జూనియర్స్ విభాగంలో జరిగిన ఈ పోటీల్లో జిల్లా తరఫున పాల్గొన్న బాల,బాలికల జట్లు విశేష ప్రతిభ కనబరిచాయి. బాలుర జట్టు ప్రథమ స్థానం, బాలికల జట్టు ద్వితీయ స్థానంలో నిలిచి, బహుమతులు కైవసం చేసుకున్నాయి. ఈ నేపథ్యంలో ఆయా జట్ల క్రీడాకారులను క్రీడా సంఘాల ప్రతినిధులు, క్రీడాభిమానులు అభినందించారు.

ఇసుక నిల్వల సీజ్



ఇసుక పోగులను చూపిస్తున్న ఎస్‌ఐ గంగరాజు

గజపతినగరం: మండలంలోని ఎస్.లింగాలవలస గ్రామ సమీపంలో అక్రమంగా నిల్వ చేసిన ఇసుక కుప్పలను సీజ్ చేసినట్లు ఎస్‌ఐ గంగరాజు ఆదివారం తెలిపారు. ఈ ఘటనపై కేసు నమోదు చేశామని, ఇవి ఎవరు నిల్వ చేశారన్న దానిపై దర్యాప్తు చేస్తున్నామన్నారు.

శృంగవరపుకోట: మండలంలోని మామిడిపల్లి, గోపాలపల్లి గ్రామ సమీపంలో అక్రమంగా ఇసుక తరలిస్తున్న నాటుబళ్లను పట్టుకుని, స్టేషన్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు.

యువకుడి ఆత్మహత్యాయత్నం

పార్వతీపురం: గడ్డిమందు తాగి యువకుడు వి.మోహనరావు ఆత్మహత్య చేసుకునేందుకు ప్రయత్నించాడు. ఈ దుర్ఘటన మక్కువ మండలంలోని డి.శిర్లాం గ్రామంలో జరిగింది. ఇదే గ్రామానికి చెందిన మోహనరావు డిగ్రీ పూర్తి చేసి, గత కొంత కాలంగా ఖాళీగా ఉంటున్నాడు. దీంతో మనస్తాపం చెందిన అతడు తాను కుటుంబానికి భారం కాకూడదని భావించి, శనివారం రాత్రి ఇంట్లో ఉన్న గడ్డిమందు తాగి, ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. అపస్మారక స్థితిలోని కొడుకును తల్లిదండ్రులు ఆదివారం చూసి, చికిత్స నిమిత్తం పార్వతీపురం ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

30న పీడీఎస్ బియ్యం వేలం

వంగర: వంగర, రేగిడి మండలాల్లో అక్రమంగా నిల్వ చేసి, పట్టుబడిన పీడీఎస్ బియ్యంను ఈ నెల 30వ తేదీన వేలం వేయనున్నట్లు సివిల్ సప్లయి డీటీ బలివాడ గోవిందరావు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపా. మొత్తం 134.60 క్వింటాళ్ల బియ్యాన్ని వేలం వేస్తున్నామని, ఆసక్తి ఉన్న వారు రూ.2 వేలు ముందుగా చెల్లించి, రేగిడి కార్యాలయంలో జరిగే వేలంలో పాల్గొనాలని కోరారు.

వేర్వేరు ప్రమాదాల్లో ఐదుగురి మృతి

- రైలు ఢీకొని ఒకరు, ఉరి వేసుకుని మరొకరు, డివైడర్ ఢీకొని ఇంకొకరు, పురుగుమందు తాగి ఇద్దరు..
- కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్న పోలీసులు



రైలుపట్టాలపై ఉన్న మృతదేహం పరిశీలిస్తున్న జీఆర్‌పీ ఎస్‌ఐ శ్రీనివాసరావు

చీపురుపల్లి: రైలు ఢీకొని వ్యక్తి దుర్మరణం చెందిన ఘటన స్థానిక రైల్వేస్టేషన్ సమీపంలో ఆదివారం జరిగింది. మృతుడు ఎవరన్నది తెలియరాలేదని, మృతుడు నీలం రంగు డ్రాయర్ ధరించి ఉన్నాడని, 40 ఏళ్ల వయసు ఉంటుందని జీఆర్‌పీ ఎస్‌ఐ సీహెచ్ శ్రీనివాసరావు తెలిపారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు పోస్టుమార్టం నిమిత్తం చీపురుపల్లి ప్రభుత్వాస్పత్రికి మృతదేహం తరలించారు. మృతదేహం కోసం ఫోన్ నంబర్ 7013273731ను కుటుంబ సభ్యులు సంప్రదించవచ్చన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

గంట్యాడ: పురుగుమందు తాగి, మహంతి ముసలనాయుడు అనే వృద్ధుడు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండలంలోని పెదమజ్జిపాలెం గ్రామంలో చోటుచేసుకుంది. శనివారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో పంట కోసం తీసుకువచ్చిన పురుగుమందు తాగి, అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయాడు. ఉదయం 11 గంటల సమయంలో అతడి పరిస్థితిని చూసిన కుటుంబ సభ్యులు వైద్యసేవల నిమిత్తం విజయనగరంలోని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడే చికిత్స పొందుతూ ఆదివారం ఉదయం 10.30 గంటలకు మృతి చెందాడు. గత కొంతకాలంగా ఆస్తమా వ్యాధితో బాధపడుతున్న ఆయన వ్యాధి తగ్గడం లేదన్న బాధతోనే ఆత్మహత్యకు పాల్పడి ఉంటాడని అంతా భావిస్తున్నారు. దీనిపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్.ఐ కె.కిరణ్‌కుమార్ నాయుడు తెలిపారు.



శ్రీహరి మృతదేహం

పురుగుమందు తాగి వ్యక్తి ఆత్మహత్య



మృతి చెందిన అప్పలనాయుడు

బొండపల్లి: పురుగుమందు తాగి, భీమవరపు అప్పలనాయుడు(40)అనే వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ విషాద ఘటన మండలంలోని కొత్తపాలెం గ్రామంలో ఆదివారం సాయంత్రం చోటుచేసుకుంది. ఎస్‌ఐ ఎస్.రవి తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. వేకువజామున పురుగుమందు తాగిన ఆయన అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. అతడిని చూసి అప్రమత్తమైన కుటుంబ సభ్యులు వైద్యసేవల నిమిత్తం విజయనగరంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అక్కడే చికిత్స పొందుతూ సాయంత్రం మృతి చెందినట్లు తెలిపారు. మృతుడి భార్య రెండేళ్ల క్రితమే మరణించగా, ఇద్దరు పిల్లలున్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామన్నారు.

యువకుడి ఆత్మహత్య

శృంగవరపుకోట: మండలంలోని కొట్టాం గ్రామానికి చెందిన యువకుడు నున్నగొప్పుల శ్రీహరి(27) ఆత్మహత్య చేసుకున్నాడు. శనివారం రాత్రి ఇంట్లో ఉన్న ఫ్యాన్‌కు ఉరి వేసుకుని చనిపోయినట్లు ఆయన తండ్రి సీతంనాయుడు తెలిపారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. యువకుడి ఆత్మహత్యకు గల కారణాలు తెలియరావాల్సి ఉందని ఎస్‌ఐ తారకేశ్వరరావు తెలిపారు. అయితే ఆర్థిక ఇబ్బందుల కారణంగానే యువకుడు చనిపోయి ఉంటాడని స్థానికులు చెబుతున్నారు.

ఆర్టీసీ ఉద్యోగి మృతి..



వేణుగోపాలనాయుడు మృతదేహం, (ఇన్‌సెట్లో) వేణుగోపాలనాయుడు(ఫైల్)

విజయనగరం క్రైమ్: మండలంలోని తోటపాలెం సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆర్టీసీ ఉద్యోగి అల్లు వేణుగోపాలనాయుడు(59) మృతి చెందాడు. వివరాలిలా ఉన్నాయి.. స్థానిక ఆర్టీసీలో జూనియర్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న ఈయన ఆదివారం తోటపాలెం సమీపంలోని ఇంటి వద్ద కాలువ పనులు చేయించి, మధ్యాహ్నం తిరిగి తన బైక్‌పై కంటోన్మెంట్‌కు వెళ్తుండగా బ్రిడ్జి దగ్గరున్న డివైడర్‌ను ఢీకొన్నారు. దీంతో అతడి తలకు తీవ్రగాయమై, అక్కడికక్కడే ప్రాణాలు విడిచారు. మృతునికి భార్య పద్మావతి, కుమారులు భార్గవ్, వైభవ్ ఉన్నారు. బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు వన్‌టౌన్ ఎస్‌ఐ రామగణేష్ తెలిపారు.